# సంధ్య అంచు

వంశీకృష్ణ

**'దొంగా - పోలీస్' ఆట 'ఆపరేషన్ డే - బ్రేక్' గా రూపాంతరం చెందిందా? మనుమల మనస్తత్వాలు కూడా రూపాంతరం చెందాయి. ఒకనాడు అసహ్యం కలిగించిన పాత్రను ఈనాడు ఆరాధిస్తున్నారా? విలువలు ఎంత 'గొప్ప' గా మారిపోతున్నాయి!**

రాత్రి కురిపిన రహస్య వర్షం తాలూకు పరిమళం ఇంకా గాలి అలల్లో అలాగే నిలిచి ఉంది. మట్టి వాసనే అయినా, అది మనిషి సహజాతం లాగా అద్భుతంగానూ ఉంది. ఒక వెండి తారా జలపాతం ఏదో పుటుక్కున తెగి నేల మీద పరచుకున్నట్లుగా ఆహ్లాదంగా ఉంది ఆ ఉదయం అంతా!

వాలు కుర్చీలో ఈజీగా కూర్చుని పేపర్ చదువుకుంటున్నారు నారాయణమూర్తి మేస్టారు. ఇంట్లో, లోపల అంతా గోల గోలగా హడావుడిగా ఉంది. పండుగ ఇంకా రెండు రోజులే ఉందేమో అది తీసుకునివచ్చే సరదా... సంరంభం అన్నీ అప్పుడే తన ప్రతాపం చూపించడం మొదలుపెట్టాయి పిల్లల ద్వారా, వాళ్ళ అల్లరి చేష్టల ద్వారా. నారాయణమూర్తి మేస్టారి నలుగురి కొడుకులు పిల్లలతో సహా వచ్చేశారు. అందుకే పెళ్ళివారి ఇల్లులా కిలకిలా నవ్వులతో, గలగల మాటలతో మారుమోగిపోతున్నది.

మేస్టారి వయసు దగ్గర దగ్గర అరవై దాటుతున్నది. అయినా ఆ వయసులో కూడా ఆయన చిన్నపిల్లాడికి మల్లే చెంగున గెంతగలడు. వయసు తెచ్చిన వృద్ధాప్యం కంటే మనసు ఇచ్చిన చలాకీతనం ఆయనలో ఎక్కువ. విశ్వవిద్యాలయాలు నేర్పిన చదువు కంటే జీవిత విద్యాలయం చెప్పిన చదువు ఆయనకు ఎక్కువ. ఏ విషయాన్నైనా అన్ని దృక్కోణాల నుంచి పరిశీలించి గానీ ఒక నిర్ణయానికి రాడు ఆయన.

ఉపాధ్యాయ వృత్తి నుంచి రిటైరైపోయి రెండు సంవత్సరాలు దాటుతున్నది. నలుగురు కొడుకులు మంచి ఉద్యోగాల్లోనే ఉన్నారు. బాధ్యతలేవీ లేవు. అందుకే ఆయన జీవితాన్ని రెండోసారి ఫ్రెష్‌గా మొదలుపెట్టినట్లుగా ఉంటాడు.

నలుగురు కొడుకులూ మేస్టార్ని తమతో వచ్చి ఉండమని గొడవ పెట్టడమూ, అందుకు ఆయన తేలిగ్గా కొట్టిపడవేస్తూ "నన్నీ పల్లెలోనే అంతిమ శ్వాస విడవనీయండ్రా" అంటూ నవ్వేయడమూ మామూలే.

ఆ పల్లె ఆయన ప్రాణం - మాయా మహార్ణవం లాంటి నగర జీవుతంలో అయన ఇమడలేడు. ఆ మంత్రనగరి సరిహద్దులు సైతం ఆయన స్పృశించడానికి సాహసించలేదు.

లేత లేత చేతుల్ని మెడ చుట్టూతా పూలదండలాగా చుట్టి "తాతయ్యా, తాతయ్యా కథ చెప్పవూ?" అంటూ చెవి దగ్గరగా చక్కిలిగింతలు పెట్టినట్లుగా వినిపించేసరికి ఆలోచనల్లోంచి బయటకు వచ్చారు మేస్టారు.

రెండో కొడుకు కూతురు సుమ గారంగా గడ్డం పట్టుకుని అడుగుతున్నది.

సుమని ఒళ్ళోకి తీసుకుని "కథ చెపుదాంలే కానీ సుమా... నువ్వు బాగా చదువుతున్నావే?" అంటూ ప్రశ్నించారు మేస్టారు.

"చదువా? దానికేం తాతయ్యా! ట్రిమెండస్‌గా చదువుతున్నాను. ఒక్క క్షణం కూడా వేస్ట్ చెయ్యకుండా నేను చదువుతాను తెలుసా? హాలిడేస్ ఎంజాయ్ చెయ్యాలనీ, ఇక్కడకు వస్తున్నాం కదా అనీ వెంట బుక్స్ ఏవీ తీసుకురాలేదు. అయినా నీకు తెలుసా రీడింగ్ నా హాబీ! ఇక్కడి కొచ్చిన రెండు రోజులుగా ఏం తోచక చచ్చిపోతున్నాను అనుకో!? టీ.వీ. వీ.సీ.పీ.ల సంగతి అటుంచి, కనీసం మైటీ హనుమాన్ లాంటి కామిక్స్ అయినా లేవాయే! రియల్లీ ఐ ఫీల్స్ వెరీ బోర్ తాతా!" అన్నది సుమ కళ్ళు చక్రాల్లా తిప్పుతూ ఆరిందాలా!

"నీ మొహం! ఐ ఫీల్స్ కాదు. ఐ ఫీల్ అనాలి" సరిచేశాడు అప్పుడే వచ్చిన రవి. సుమ కంటే రవి మూడేళ్ళు పెద్ద. వాడిప్పుడు సెవంత్ స్టాండర్డ్‌లో ఉన్నాడు.

"దిస్ ఫూల్ డోంట్ లెర్న్ ప్రాపర్లీ ఎండ్ బ్లేమ్స్ హర్ మామ్ ఆల్వేస్ గ్రాండ్‌పాపా" అంటూ మేస్టారుతో ఫిర్యాదు చేశాడు రవి.

మేస్టారు చిన్నగా నవ్వుకుని "ఒరే నాన్నా దిస్ ఫూల్ డోంట్ లెర్న్ అనకూడదురా! దిస్ ఫూల్ డజంట్ లెర్న్ అనాలి" అంటూ కరెక్ట్ చేశారు మేస్టారు.

'అయ్యిందా అబ్బాయిగారి పని?' అన్నట్లుగా చూసింది సుమ.

రవి నిర్లక్ష్యంగా తల ఎగురేశాడు. రవికి రాంబో మేనియా! రవి 'ఫస్ట్ బ్లడ్' సినిమాలోని సిల్వెస్టర్ స్టాలోన్ లాగా ఉంటాడు. అంటే నిజంగా శరీర సౌష్ఠవంలో అలా ఉంటాడని కాదు. కానీ, డ్రెస్ అప్పియరెన్స్‌లోనూ, నడకలోనూ సిల్వెస్టర్‌ను అనుసరిస్తాడు. ప్లాస్టిక్ స్టెన్‌గన్ ఒకటి పట్టుకుని టపటపమంటూ కాల్చేస్తూ హీరోలాగా ఫీలైపోతాడు. అంతే కాదు హీ-మేన్ లాగో, సూపర్‌మేన్‌లాగో రెక్కలు కట్టుకుని ఆకాశంలోకి ఎగిరిపోవాలని వాడికో బలమైన కోరిక. తనకు ఇష్టం లేని పని ఏది జరిగినా రాంబోలాగా చావబాదేస్తుంటాడు అందర్నీ.

"ఇట్స్ హెర్క్యులస్ టాస్క్ టు పాస్ ఆన్ ది టైమ్ ఇన్ దిస్ డర్టీ విలేజ్, వాట్ కెన్ ఐ డూ? ఓ గాడ్! కనీసం చదువుదామంటే ఒక్కటంటే ఒక్కటైనా మంచి పుస్తకం లేదు. ఎందుకూ, దరిద్రంగా రేకుల నిండా డర్టీ పురాణాస్ ఉన్నాయి" అంటూ అసహనంగా గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు రవి.

రవిని పిలిచి పురాణాల గొప్పతనం గురించి ఓ చిన్న లెక్చర్ ఇవ్వా లనిపించింది మేస్టారికి. కానీ చిన్నగా తనలో తనే నవ్వుకుంటూ ఉండిపోయారు ఆయన. తన మనవళ్ళనీ, మనవరాళ్ళనీ చూస్తే ఆయనకు ముచ్చటేస్తుంది. వాళ్ళ ఫాస్ట్‌నెస్‌ని చూస్తుంటే ఒక్కోసారి భయం కూడా వేస్తుంది ఆయనకు. మానసికంగా వాళ్ళు ఎంతో ఎదిగిపోయారు. నలుగురు కొడుకులు, నాలుగు రాష్ట్రాల రాజధానుల్లో ఉంటారేమో... ఆ ఆరిస్టోక్రటిక్ కల్చర్ అంతా మూర్తీభవించినట్లు కనిపిస్తుంది వారిలో ఆయనకు. తన కాలానికీ, ఇప్పటి కాలానికీ పోల్చి చూసి 'జనరేషన్ గేప్' అనుకుంటూ ఆశ్చర్యపోయారు ఆయన.

"ఏమిటో, మీలో మీరే నవ్వుకుంటున్నారు!" అంటూ కాఫీ కప్పుతో ప్రవేశించింది శారదమ్మ.

మేస్టారు కాఫీ కప్పు అందుకుని సుమ గురించీ, రవి గురించీ చెప్పారు.

అంతా విన్న శారదమ్మ "నిజమేనండీ! పిల్లలకు బొత్తిగా మన సంస్కృతీ, సంప్రదాయం తెలియకుండా పోతున్నాయి. పెద్దది రమ్యకి ఇరవై మూడు, ఇరవై నాలుగు ఏళ్ళు వచ్చాయా? ఇంకా స్కర్ట్ లంటూ, మిడ్డీలంటూ ఏవేవో పిచ్చి పిచ్చి డ్రెస్సులన్నీ వేస్తుంది తప్పిస్తే చీరససేమిరా కట్టదే! అసలు చీర కట్టులో ఉన్న అందం ఎన్ని వెధవ డ్రెస్సులు వేస్తే మాత్రం వస్తుందా చెప్పండి!" అన్నది ఒకింత ఆవేదనతో.

కప్పు అందిస్తూ చిన్నగా నిట్టూర్చారు మేస్టారు.

"మనకున్న సాంస్కృతిక వారసత్వాన్ని చేజేతులా మనమే నాశనం చేసుకుంటున్నామేమో అనిపిస్తున్నదండీ ఒక్కొక్కసారి ఆలోచిస్తే. ఉద్యోగాలంటూ మనవాళ్ళంతా విసిరేసినట్లుగా తలో మూలకు వెళ్ళిపోయారా? వాళ్ళ ఆలోచనల్లో, భావాల్లో ఎంతెంత అగాధాలు ఏర్పడ్డాయో గమనించారా? మనదీ కాని నాగరికత కోసం పాకులాడటం మన పిల్లల్లో బాగా పెరిగిపోయింది. మొన్నా మధ్య 'గీత' గ్లాస్‌హౌస్‌లో ఎవరితోనో చెట్టాపట్టా లేసుకుని కనిపించిందట. ఇంటి కొచ్చాక నిలదీసి అడిగితే... "డేటింగ్" తప్పేమీ కాదని, 'ఇట్సె సింబల్ ఆఫ్ వుమెన్స్ లిబ్' అంటూ తల్లితో వాదన వేసుకుందట" శారదమ్మ ఇంకా ఏదో చెప్పబోతుండగానే బిలబిలమంటూ పదిమంది పిల్లలు ఒక్కసారిగా లోపలకు దూసుకు వచ్చారు. వాళ్ళలో ఇద్దరు మరో పన్నెండేళ్ళ పిల్లాడిని చేతుల మీద తీసుకుని వచ్చారు. ఆ పిల్లాడి నుదుటి నుంచి రక్తం ధారలా కారుతున్నది.

"ఏమైంది?" అంటూ ఆతురతతో లేచారు మేస్టారు.

"మీ రవి కొట్టాడండీ" బుల్లెట్ లాగా వచ్చింది జవాబు.

పిల్లాడి నుదురంతా శుభ్రం చేసి కట్టు కట్టి పంపించారు మేస్టారు.

వాళ్ళంతా వెళ్ళిపోయాక "ఏరా రవీ, ఎందుకు కొట్టావు?" అంటూ ప్రశ్నించారు మేస్టారు.

"నేను మొదటే చెప్పాను. నాతో గొడవ పెట్టుకోవద్దని. ఆ కట్‌మల్‌గాడు వినలేదు నేనేం చెయ్యను?" పొగరుగా చెప్పాడు రవి.

"అసలేం జరిగిందో చెప్పు!" ప్రశ్నించింది గొడవకి లోపలనుంచి బయటకొచ్చిన లలిత. లలిత రవి తల్లి.

"నేను చెప్తా నుండమ్మా!" అంటూ సుమ అందుకుంది.

"ఏం లే దమ్మా! అన్నయ్యా వాళ్ళు ప్రతిరోజూ ఆపరేషన్ డే బ్రేక్ ఆట ఆడుతున్నారమ్మా! అన్నయ్యేమో టెర్రరిస్ట్ అట, చంద్రేమో సబ్ ఇన్‌స్పెక్టరట. రఘు అన్నయ్యోమో చంద్రస్వామి అట. ఇలా రోజూ ఆడుతున్నారమ్మా. కానీ ఇవాళ చంద్ర టెర్రరిస్ట్‌గా ఉంటా నన్నాడట. ర వన్నయ్యోమో అందుకు ఒప్పుకోలేదు. కాదు, కూడదు నేనే టెర్రరిస్ట్‌గా ఉంటాను అన్నాడు చంద్ర. అందుకని ర వన్నయ్య తల మీద రాళ్ళతో కొట్టాడమ్మా!"

సుమ చెప్పిం దంతా విన్న లలిత ఆగ్రహం పట్టలేకపోయింది. దాంతో రవి వీపు విమానం మోత మోగింది.

"అయ్యో! పిల్లాణ్ణి చంపేస్తావా ఏమిటే?" అంటూ శారదమ్మ అడ్డుకోకపోతే, రవి ఏమయ్యేవాడో!

మాస్టారి గుండె కలుక్కుమన్నట్లు అయింది. ఇంత చిన్న వయసులోనే మనసులో ఇంత శాడిజమా? ఈ టీ.వీ.లు, ఈ రాంబో సినిమాలు, ఈ వీడియోలు - ఇప్పటి తరాన్ని ఇంతగా ప్రభావితం

**'ఆ క్షణాలు'**

"మీ విదేశీ యాత్రలోని మరవురాని మధుర క్షణాలు ఏవి" అన్న విలేఖరి ప్రశ్నకు సినిమా హీరోయిన్ చెప్పిన సమాధానం -

"నాతోబాటు వచ్చిన మా ఆయన కనపడకుండాపోయిన ఆ రెండు రోజులూ!"

చేస్తున్నాయా?

ఆయన కెందుకో ఒక్కసారిగా తన బాల్యం గుర్తుకొచ్చింది. పచ్చ పచ్చని పొలం గట్లంట పరుగెత్తడం, పిల్ల కాలువల్లో వెచ్చ వెచ్చటి నీళ్ళు తాగడం, కాలు వొద్దున వెన్నెల్లో ఇసుక గూళ్ళు కట్టుకోవడం, దాని ముందు వచ్చీ రాని ముగ్గులు వేయడం ... ఓహ్!

సెలవు లొస్తే చాలు - పిల్ల కాలువంతా తమ జట్టు ఈతల పోటీలతో తుళ్ళి తుళ్ళి పడేది. తోటలోని జామచెట్టెక్కి, దోరమగ్గిన కాయలు కోసుకుని కాలువలోకి దూకేవాళ్ళు. అరమైలు వెడల్పుండే మునేరు కాలువని ఎవరు ముందు ఈదితే, వాళ్ళు విజేత లయినట్లు లెక్క. వాళ్ళకి మిగతా వాళ్ళు కోసిన జామకాయ లన్నీ ఉప్పూ, కారం అద్ది తినిపించాలి. అది బహుమతి.

అంతేనా? "యన్యజ్ఞాన దయా సింధో" లాంటి శ్లోకాలు వల్లె వేస్తూ ఎంత ఉత్సాహంగా ఊరూ, వాడా ఏకం చేసేవారూ! ఎంత ఉత్సాహంగా గుడినీ, బడినీ ఏకం చేసేవారు!

ఎగిరే తూనీగని వెంటాడి, వేటాడి పట్టుకుని, దాని రెక్కలకి దారం కట్టి ఆడించటం ... ఎంత అద్భుతమైన బాల్యం! ఎంత అందమైన వర్ణ చిత్రం!

ఇప్పటితరం ఎందు కింత స్పందనారహితంగా తయారవుతోంది? ఇప్పటి తరం ఎందు కింత క్రూరంగా, శాడిస్టిక్‌గా తనను తాను చంపేసుకుంటున్నది!

**- 2 -**

"తాతయ్యా! ఆ రోజు కథ చెపుతా నన్నావ్! చెప్పనే లేదు. ఈ రోజు చెప్పవా?" అంటూ ఒళ్ళోకి ఎక్కేసింది సుమ.

"నీకు ఏం కథ కావాలి? చేను మేసిన పేను కథ కావాలా, లేక రెక్కలకి దారం కట్టిన తూనీగ కథ చెప్పమంటావా?" అడిగారు మాస్టారు సుమ బుగ్గల్ని ముద్దాడుతూ.

"ఛీ! ఆ కథ లేం బావుంటాయి తాతయ్యా! ఒక సస్పెన్సా, థ్రిల్లా? నాకు గో ఫర్ గోల్డ్ లాంటి కథలు కావాలి" అంటూ గారాంగా పలికింది సుమ.

"గో ఫర్ గోల్డ్ అంటే ఇంగ్లీషు కథమ్మా! మనకు ఇంగ్లీషు కథ లెందుకు? చక్కగా తెలుగు కథలైతే బావుంటాయేమో!" అన్నారు మాస్టారు.

"నీకు రావు కదూ ఇంగ్లీషు కథలు?" వెక్కిరించింది సుమ.

"సరే చెపుతా విను. వన్స్ అపాన్ ఎ టైమ్ దేర్ లివ్డ్ ఏ మైటీ ..." అంటూ మొదలుపెట్టారు మాస్టారు. ఇంతలో రవి కూడా వచ్చాడు.

ఆ సాయంత్రం "ఏరా రవీ! ఆపరేషన్ డే బ్రేక్ ఆట అంటే ఏమిట్రా?" అంటూ అడిగారు మాస్టారు.

"ఏం లేదు తాతయ్యా! ఈ ఆటని ముగ్గురు ఆడతా రన్నమాట. ఒకడేమో టెర్రరిస్ట్, ఒకడేమో సబ్ ఇన్‌స్పెక్టర్, ఒకడేమో చంద్రస్వామి."

"చంద్రస్వామి అంటే ..." మధ్యలో అడ్డు తగిలారు మాస్టారు.


"చంద్రస్వామి అంటే భగవాన్ చంద్రస్వామి అన్నమాట. ఆయన ఈ ఆటలో ఆయుధాలు సప్లై చేస్తాడు. చివర్లో యుద్ధం జరుగుతుంది. యుద్ధంలో సబ్ ఇన్‌స్పెక్టర్ని చంపేసి టెర్రరిస్ట్, చంద్రస్వామి పారిపోతారు. అందుకని ఈ ఆటలో ఎప్పుడూ నేనే టెర్రరిస్ట్ వేషం వేస్తాను. ఎందుకంటే ఎప్పుడూ గెలిచేది టెర్రరిస్టే కదా!" అన్నాడు రవి ఉత్సాహంగా.

అయితే ఇంతా చేస్తే ఇది "దొంగా - పోలీస్ ఆటన్నమాట" అన్నారు మాస్టారు బయటికి.

"ఏం కాదు. ఆపరేషన్ డే బ్రేక్" అంటూ బయటికి పరుగెత్తాడు రవి.

మాస్టారు ఆలోచిస్తూ ఉండిపోయారు. తమ కాలంలో కూడా 'దొంగా - పోలీస్' ఆట ఉన్నా దొంగ వేషం వేయాలంటే అందరూ అసహ్యించుకునేవారు. తమకు బాగా కోపం ఉండి, ఎవరిమీదైనా కసి తీర్చుకోవా లనుకుంటే వాళ్ళకి దొంగ వేషం ఇచ్చేవాళ్ళు. అదే, కాలం మారి 'ఆపరేషన్ డే బ్రేక్'గా మారిం దన్నమాట!





ఆట రూపాంతరం చెందడంలోనే కాదు. మనుమల మనస్తత్వాలు కూడా ఎంతగా రూపాంతరం చెందాయి? ఒకనాడు అసహ్యం కలిగించిన పాత్రను ఈనాడు ఆరాధిస్తున్నారా? విలువలు ఎంత 'గొప్ప'గా మారిపోతున్నాయి!

ఇంతలో వీధిలో ఎవరో అరుచుకుంటూ వెళ్తున్నారు - "మీ అభిమాన నటుడు నటించిన 'గూండా' తప్పక చూడండి. ఖైదీగా విశ్వరూపం చూపిన మీ అభిమాన నటుడు 'గూండా'గా మీ ముందుకు వస్తున్నాడు...."

ఆ మాటలు వినగానే ఆయనలో అసహనం మరింత పెరిగింది. ఈ సినిమాలు ... ఈ సినిమాలే సగం జనాభాని పాడుచేస్తున్నది. ఈ సినిమాలే మనిషిలోని రాక్షసుడిని నిద్రలేపుతున్నది.

అలసటగా కుర్చీలో కూర్చుండిపోయారు మాస్టారు. ఎదురుగా ఉన్న పేపర్‌లో ఒక ఫొటో ఆయన దృష్టిని ఆకర్షించింది. దాన్ని చేతులోకి తీసుకుని, ఫొటో కింద ఉన్న న్యూస్ చదివారాయన. ఆ న్యూస్ చదివేసరికి ఆయన ఒళ్ళు జలదరించింది ఒక్కసారిగా. భయంతో కాదు, అసహ్యంతో!

మద్రాసులో ఒకతను కేవలం సరదా కోసం ఆడపిల్లల్ని కిడ్నాప్ చేసి, ఆ తర్వాత వాళ్ళని రేప్ చేసి, చంపేసి, పోలీసులకి ఆచూకీ దొరకకుండా ఉండటం కోసం తను నివసిస్తున్న ఇంటి గోడల్లోనే పెట్టి ప్లాస్టరింగ్ చేసేస్తుంటే, ఎంతోకాలానికి గానీ పోలీసులు ఆ రహస్యం కనుక్కోలేకపోయారట. వెంటనే అతన్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారట.

అదీ ఆ వార్త సారాంశం. అది చదివాక, ఆ రోజంతా మాస్టారి మనసు మనసులో లేకుండాపోయింది.

## - 3 -

పండుగ వచ్చి వెళ్ళింది. హడావుడి అంత తగ్గిపోయింది. వారం రోజులపాటు ఆ ఇంటిని ఓజోన్ పొరలాగా కప్పుకున్న సందడి, సంరంభం అంటూ మళ్ళీ మూగవోయింది. మళ్ళీ ఎవరి గూళ్ళకి వాళ్ళు వెళ్ళిపోవాల్సిందే కదా! లలిత-సుధీర్, గీత-రామం - అంత బయలుదేరారు.

వాకిట్లో జట్కా బండి ఆగి ఉంది. సామానంత సర్దేశారు బండిలో. శారదమ్మ ఓ వంక నీళ్ళు నిండిన కళ్ళతో నిల్చుని ఉంది. మళ్ళీ ఎప్పటికో కానీ కలవడం కుదరదు. చూడాలని మనసు ఎంత తహతహ లాడినా, రావాలనీ, ఆత్మీయంగా గుండె విప్పుకోవాలనీ ఎంత తల్లడిల్లినా వీలు లేని తప్పనిసరి దూరం. పాపులేషన్ ఎక్స్‌ప్లోజనూ, అర్బనైజేషనూ - ఇవన్నీ మనిషినీ మనిషినీ విడదీస్తున్నాయా?

ఈ ఆధునిక నాగరికత మానవ సంబంధాలని, బలహీనపరుస్తోందా?

"రవినీ, సుమనీ నా దగ్గర ఉంచేయకూడదట్రా?" నారాయణమూర్తి మాస్టారి ప్రశ్న. అప్పటికి అది ఏ పన్నెండో సారో ఆయన అడగటం.

"ఎలా నాన్నగారూ? వాళ్ళ చదువులు అవీ ఉన్నాయి కదా! అంతంత డబ్బులు పోసి పెద్ద పెద్ద స్కూళ్ళలో చదివిస్తున్నప్పుడు ఆబ్సెంట్ అయితే మనకే నష్టం కదా! పోనీ మీరు ఒక్కరూ ఇక్కడ ఉండకపోతే, మాతోపాటు వచ్చేయకూడదూ?' సుధీర్ ప్రశ్న.

"వాడి చదువు అంత ముఖ్య మనుకుంటే, ఆ చదు వేదో ఇక్కడ చదువుతాడులేరా! రవినీ, సుమనీ ఇక్కడే ఉంచండి. నాకు బాగా మాలి మయ్యారు కూడా" అన్నది శారదమ్మ.

ఎంత చెప్పినా అర్థం కా దేమిటమ్మా! వాళ్ళ భవిష్యత్తుని చెడగొట్టటం ఎందుకు? అక్కడి స్కూళ్ళలో లభించే ఆడియో, వీడియో, కోచింగ్ - ఈ పల్లెటూళ్ళో ఉన్నాయా? వాడి వ్యక్తిత్వం సమగ్రంగా రూపొందిద్దుకోవాలంటే ఉన్నతమైన, ఉత్తమమైన చదువు అవసరమా, కాదా?" సందేహిస్తున్నట్టుగా అన్నాడు సుధీర్.

"రవినీ, సుమనీ ఈ వారం రోజులు బాగా గమనించాకే చెబుతున్నానురా! వాళ్ళ వ్యక్తిత్వమే నీకు ముఖ్యమైతే వాళ్ళని నా దగ్గరే ఉంచు. లేదూ, వాళ్ళ ఫస్ట్ రేంక్‌లు, వాళ్ళు పెరుగుతున్న నియో రిచ్ కల్చర్ - అదే ముఖ్యం అనుకుంటే నీతో తీసుకెళ్ళు. నేను ఇక చెప్పే దేమీ లేదు. సంధ్య అంచున నిల్చున్న రేపటి తరాన్ని తీసుకెళ్ళాల్సింది వెలుగులోకో, చీకట్లోకో మీరే ఆలోచించుకోండి!"

తాతయ్య ఒళ్ళో కూర్చుని సుమ చెయ్యూపుతుండగా జట్కా ముందుకు సాగిపోయింది. ★